

పోలిపల్లి పైడితల్లికి ప్రణమిల్లి

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం కనుల పండువగా జరిగింది. - 8లో



రాష్ట్ర స్థాయి వాలీబాల్ విజేత యానాం

చీపురుపల్లి కనకమహాలక్ష్మి జాతర సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ విజేతగా యానాం జట్టు నిలిచింది. ట్రోఫీను సొంతం చేసుకుంది. - 8లో



ఎన్నికల్లో పోలింగ్ అధికారులది కీలక పాత్ర

శాసనమండలి ఎన్నికలు సజావుగా, పకడ్బందీగా జరిగేందుకు పోలింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకటరావు పేర్కొన్నారు. - 8లో

సాక్షి విజయనగరం

బుధవారం । 1 । మార్చి । 2023

న్యూస్‌రీల్

రైలు ప్రయాణికుల ఘెరావ్



విజయనగరం రైల్వే స్టేషన్‌లో నిలిచిన షాలీమార్ ఎక్స్‌ప్రెస్

విజయనగరం టౌన్: విశాఖపట్టణం, సికింద్రాబాద్ నుంచి షాలీమార్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ విజయనగరం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ నంబర్ 4లో మంగళవారం రాత్రి ఆగింది. అయితే, ఒక్కసారిగా కోచ్ నంబర్ బి–6, 7 ఏసీ కోచ్‌ల నుంచి ప్రయాణికులు కిందకు దిగిపోయారు. కోచ్‌లో ఏసీలు పనిచేయడం లేదని చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆందోళన చేశారు. దీంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, కమర్షియల్ అధికారులు హుటాహుటిన కోచ్ వద్దకు పరుగులు తీసి పరిస్థితిని సమీక్షించారు. వెంటనే అధికారులు ఏసీ మెకానిక్స్‌ను తీసుకొచ్చి బాగుచేయించారు. ఈ ఘటనతో రైలు సుమారు గంట ఆలస్యంగా బయలుదేరింది.

జామి ఎల్లారమ్మ హుండీల ఆదాయం రూ.19.07లక్షలు



జామి ఎల్లారమ్మ జాతరలో వచ్చిన ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

జామి: జామి ఎల్లారమ్మ అమ్మవారి జాతర సందర్భంగా వచ్చిన హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మొత్తం రూ.19,07,476ల ఆదాయం వచ్చినట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. గత ఏడాది కంటే రూ.31,000లు అధికంగా వచ్చిందన్నారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.4,34,390లు, ప్రసాదం విక్రయం ద్వారా రూ.2,68,250లు, హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల రూపంలో రూ.11,26,634లు, విరాళాల రూపంలో రూ.78,202లు ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, ఉప సర్పంచ్ అల్లు పద్మ, ఏఎస్‌ఐ రాజాన నర్సింగరావు, అమ్మవారి సేవకులు పాల్గొన్నారు.

అరటి బెరడుతో ఉత్పత్తుల తయారీ ప్రాజెక్టు అదుర్స్


- పర్యావరణ హిత ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతి అందుకుంటున్న వి.యశస్విని

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని ఎస్.కోట మండలం ధర్మవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు వి.యశస్విని, కె.వాసవి ప్రదర్శించిన అరటి బెరడుతో పర్యావరణహిత ఉత్పత్తుల ప్రాజెక్టు న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైంది. 'పర్యావరణం –క్లైమేట్ చేంజ్ థీమ్'లో విద్యార్థులు ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. విజయవాడ నగరమేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, రాష్ట్ర విద్యాపరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఆర్‌జేడీ నాగమణి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. విద్యార్థులతో పాటు గైడ్ వి.రమేష్‌ను డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎం.కృష్ణారావు, పాఠశాల హెచ్‌ఎం జి.లక్ష్మి అభినందించారు.

రైతుల ఖాతాలకు రైతు భరోసా నిధులు



రైతులకు చెక్కును అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. జిల్లాలోని 2,51,659 మంది రైతులకు రూ.53.36 కోట్లు పెట్టుబడి సాయం అందినట్టు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. విజయనగరం రైతు శిక్షణ కేంద్రంలో నిధుల నమూనా చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ ఏలు నాగభూషణరావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

శంబర పోలమాంబ పండగకు..

సర్కారు పెద్దపీట

- ప్రభుత్వ పండగగా గుర్తింపు
- ఏటా ఐటీడీఏ ద్వారా రూ.50 లక్షల మేర అదనపు నిధులు
- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఫలించిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కృషి
- ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు
- ఆనందంలో భక్తలోకం

పోలమాంబ అమ్మవారి ఆదాయమిలా...

సంవత్సరం	ఆదాయం
2019-2020	రూ.71,64,080
2020-2021	రూ.70,41,750
2021-2022	రూ.76,81,761





శంబరలోని పోలమాంబ చదురుగుడి (ఇన్‌సెట్లో) శంబరలో పోలమాంబ అమ్మవారు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉత్తరాంధ్రకే కాదు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన లక్షలాదిమంది భక్తులు కొలిచే శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం పరిధి మక్కువ మండలంలోని శంబరలో ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఘనంగా జరిగే జాతరను రాష్ట్ర పండగగా గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న భక్తులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇందుకోసం ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర చేసిన కృషి ఫలించింది. తద్వారా ఆలయానికి ఏటా రూ.50 లక్షల చొప్పున ప్రభుత్వం అదనంగా నిధులను పార్వతీపురం ఐటీడీఏ ద్వారా సమకూర్చనుంది. దీంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కలుగుతుందని భక్తులు హర్షధ్వానాలు వ్యక్తం చేస్తున్నారు.

శంబర పోలమాంబ అమ్మవారి జాతర 1982 సంవత్సరానికి ముందు గ్రామ మున్సబు, పూజారి కుటుంబీకులు, కొండదొర కులస్తులు, గిరడవారు, పాడుపురెడ్డివారు, తీళ్లవారు, కరణం కుటుంబీకులు రెవెన్యూ పెత్తందారులుగా వ్యవహరించేవారు. అప్పట్లో ప్రతి ఇంటికి రూ.2 నుంచి రూ.10 వరకూ, రైతులకు ఉన్న పశువుల యేర్లును బట్టి చందాలు వసూలు చేసి అమ్మవారి జాతర నిర్వహించేవారు. జాతరకు వచ్చిన భక్తుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు భాగవతం తదితర నాటకాలు వేయించేవారు. ఆ కళాకారులకు భోజనం కోసం వంటసామగ్రిని శంబర గ్రామానికి చెందిన సావుకార్లు అందించేవారు. అప్పట్లో సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం మండలాలకు చెందిన వ్యాపారులు కూడా ముందుగా గ్రామానికి వచ్చేవారు. పదిరోజులు అద్దెకు ఇళ్లను తీసుకునేవారు. జాతరలో అన్ని వస్తువులను విక్రయించేవారు. ఇప్పుడు శంబర పోలమాంబ అమ్మవారి జాతర పది వారాల పాటు జరుగుతోంది. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

దేవదాయశాఖ ఆధ్వర్యంలో...

జాతరను దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలంటూ శంబర గ్రామానికి చెందిన కొంతమంది యువకులు 1982 సంవత్సరములో అప్పటి శ్రీకాకుళం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను కలిశారు. అప్పటి నుంచి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీని కూడా అప్పుడే ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఏటా జాతరలో వచ్చిన ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2004 సంవత్సరంలో అమ్మవారికి ఆలయాన్ని నిర్మించారు.

మరింత అభివృద్ధికి దోహదం...

రాష్ట్ర గిరిజన జాతరగా శంబర పోలమాంబ అమ్మవారి పండుగను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఆ మేరకు జీవోను తాజాగా విడుదల చేసింది. తద్వారా ప్రతి ఏటా ఐటీడీఏ ద్వారా అమ్మవారి జాతరకు రూ.50 లక్షల చొప్పున నిధులు విడుదల కానున్నాయి. ఆ నిధులను జాతర నిర్వహణతో పాటు ఆలయ అభివృద్ధి పనులు, భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి అవకాశం కలుగుతుంది. ఫిబ్రవరి 21వ తేదీన అమ్మవారి ఆలయాన్ని రాజమహేంద్రవరం దేవదాయశాఖ ఆర్‌జేసీ ఎంవీ సురేష్‌బాబు సందర్శించారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించి ఎంత నిధులు అవసరమో అంచనా వేసి పంపించాలని ఈఓ వి.రాధాకృష్ణకు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడుకు సూచించారు. చదురుగుడి, వనంగుడి ఆలయాలు వద్ద శాశ్వత క్యూలైన్లు ఏర్పాటు చేయడానికి పరిశీలించారు. అమ్మవారి ఆలయంలో వంశపారంపర్యంగా సేవచేస్తున్న పూజారులను శాశ్వత నియామకం చేపడతామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చదురుగుడి విస్తరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు.

'మిరాకిల్' భూ కబ్జాపై సర్వే

- ప్రభుత్వ భూములు ఆక్రమించినట్టు నిర్ధారణ
- కంచెవేసేందుకు సిద్ధమైన రెవెన్యూ అధికారులు



రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సిబ్బంది

భోగాపురం:

మండలంలోని ముంజేరు రెవెన్యూ పరిధిలో ఉన్న మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ అధినేత, జనసేన పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి లోకం మాధవి భూ అక్రమాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. సర్వే నంబర్ 293, 296, 337, 343, 342, 391, 392లలో సుమారు 14 ఎకరాలకు పైగా ప్రభుత్వభూమి కబ్జాకు పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై భోగాపురం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసినట్టు నిర్ధారించారు. ప్రభుత్వభూమికి రక్షణగా కంచె వేసేందుకు సోమవారం సిద్ధమయ్యారు. దీనిని స్థానికులతో పాటు సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఆర్‌ఐ కిశోర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఎవరు ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర, డ్రోన్ సర్వేతో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి భూమి చుట్టూ కంచె వేస్తున్నామని స్పష్టంచేశారు.

అంబరాన్నంటిన సిరిమాను సంబరం



భక్తుల సమక్షంలో సాగుతున్న కొత్త, పాతపోలమ్మ సిరిమాను తిరువీధి



పూజలు చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు



సిరిమానుకు పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

బొబ్బిలి రూరల్: మంగళవాయిద్యాలు.. భక్తుల జయ జయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ బొబ్బిలి మండలంలోని పారాది కొత్తపోలమ్మ, పాత పోలమ్మ, నూకాలమ్మ సిరిమానోత్సవం మంగళవారం సంబరంగా జరిగింది. పూజారి గిరడరాములు రూపంలో పారాది గ్రామ వీధుల్లోకి అమ్మవారు తరలివచ్చిన వేళ భక్తలోకం ప్రణమిల్లింది. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని స్మరించింది. తొమ్మిదేళ్లకోసారి నిర్వహించే ఈ సంబరాలు కరానాతో 11 ఏళ్ల తరువాత నిర్వహించడం, 13 గ్రామాల పండగ కావడంతో సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. పులివేషాలు, కోలాటం, శక్తిరూప ప్రదర్శనలు అలరించాయి. సిరిమానుకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎంపీ బొత్సఝాన్సీ పూజలు చేశారు. ఉత్సవంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఆయా గ్రామాల పెద్దలు, యువకులు పాల్గొన్నారు. సీఐ ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు జ్ఞానప్రసాద్, పోలినాయుడు తమ సిబ్బందితో బందోబస్తు విధులు నిర్వర్తించారు.

సమాజ సేవకులు దేశానికి అవసరం

- కంచికామకోటి పీఠాధిపతి స్వామి విజయేంద్ర సరస్వతి



మాట్లాడుతున్న కంచి కామకోటి పీఠాధిపతి స్వామి శంకర విజయేంద్ర సరస్వతి

కొత్తవలస: సమాజసేవ చేసేవారు దేశానికి ఎంతో అవసరమని కంచి కామకోటి పీఠాధిపతి స్వామి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. కొత్తవలస మండలం మంగళపాలెం గురుదేవా చారిటబుల్ ట్రస్టును ఆయన మంగళవారం రాత్రి సందర్శించారు. ట్రస్టు ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల తయారీ యూనిట్, ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేసిన సేవ మాధవ సేవకన్నా గొప్పదన్నారు. ఇంత మారుమూల గ్రామంలో లక్షలాది మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేస్తూ వారి అభ్యోన్నతికి కృషి చేయడం బృహత్‌కార్యక్రమంగా పేర్కొన్నారు. సమాజ హితం కోసం వేదాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే దేశ ప్రగతి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధినేత జగదీష్‌బాబు, వైద్యులు అచ్యుతరామయ్య, టి.సుబ్బారావు, సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎస్‌ఐ బొడ్డు దేవి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యాబోధన అవసరం

విజయనగరం రూరల్/టౌన్: విలువలతో కూడిన విద్యాబోధనతోనే సత్ప్రవర్తన అలవడుతుందని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. రామనారాయణం, కన్యకపరమేశ్వరి ఆలయంలో మంగళవారం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. శ్రీరాముడు సకలగుణాభిరాముడని, తన సత్ప్రవర్తనతో ఆదర్శప్రాయుడయ్యాడని తెలిపారు. రామచరిత విశ్వవ్యాప్తమని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కౌశిక్ దంపతులు స్వామివారి ఆశీస్సులు పొందారు. నారాయణం శ్రీనివాస్ దంపతులు స్వామివారిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కె.ప్రకాష్, నానాజీ, ఉపేంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో మహారాజా సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మృతి



ఆర్.వి.ప్రసన్నకుమారి (ఫైల్)

విజయనగరం టౌన్: విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వి.ప్రసన్న కుమారి మంగళవారం వేకువజామున గుండెపోటుతో మృతిచెందారు. ఆమె 2022 జూలై 5న ఇక్కడ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆమె రాజమండ్రిలో ఉన్న విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆమె తల్లి అయితం అప్పలరాజు మహారాజా కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా, భరతనాట్యం అధ్యాపకురాలిగా పనిచేశారు. తల్లి వద్దనే భరతనాట్యంలో ప్రసన్న కుమారి ఓనమాలు దిద్దారు. అనంతరం గురువులు కనకదుర్గ, రామలింగ శాస్త్రి వద్ద శిష్యరికం చేసి భరతనాట్యంలో డిప్లమో చేశారు. కళాశాలలో వీణవాయిద్యం నేర్చుకున్నారు. ఇదే కళాశాలలో సుమారు 24 ఏళ్ల పాటు భరతనాట్యం విభాగం అధ్యాపకురాలిగా పనిచేశారు. ఆమె మృతికి కలెక్టర్ సూర్యకుమారి, జేసీ కె.మయూర్‌అశోక్, కళాపీఠాల ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, సంగీత సంస్థలు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

మాజీ సైనికుల సంక్షేమమే లక్ష్యం

విజయనగరం అర్బన్:

మాజీ సైనికులు, వారి కుటుంబు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని నేషనల్ ఎక్స్ సర్వీసెస్ కో ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత డీజీ టీఆర్‌కే మూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సైనిక సంక్షేమ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మాజీ సైనికుల సీఎస్డీ క్యాంటీన్, ఆస్పత్రి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఇళ్ల పట్టాలు పొందిన మాజీ సైనికులకు, వితంతువులకు, యుద్ధంలో మరణించిన వీరుల భార్యలకు గాజులరేగలో ఇచ్చిన పట్టాలు సబ్ డివిజన్ చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణకు విజ్ఞప్తిచేశామన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి గాజులరేగలోని ఇళ్ల స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోనల్ నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన సలహాదారులు టి.భోగేశ్వరరావు, మనోహర్ రాజు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసులు, ఆడం రాజు, సాహు, ప్రసన్న కుమార్, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జోనల్, ప్రిసైడింగ్ అధికారులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున బ్యాలెట్ పేపర్ పెద్దదిగా ఉంటుందని, దానిని మడతపెట్టి బాక్స్‌లో వేయించడం ప్రధానమైనదిగా గుర్తించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 14 రకాల ఐడీ ప్రూఫ్‌లలో ఏదో ఒక ఐడీ ప్రూఫ్ తీసుకువచ్చిన వారిని మాత్రమే ఓటింగ్‌కు అనుమతించాలన్నారు. పోలింగ్ ముందురోజు, పోలింగ్ రోజున సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో గణపతిరావు, జోనల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

6,800 'చేయూత' యూనిట్ల మంజూరు

- పశుసంవర్ధక శాఖ జేడీ రమణ



పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న జేడీ రమణ

జామి: జిల్లాలోని మహిళా సహకార సంఘాలకు సెర్ప్ సౌజన్యంతో వైఎస్సార్ చేయూత పథకం కింద గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు యూనిట్లు మంజూరుచేసినట్టు పశుసంవర్ధక శాఖ జేడీ వై.వి. రమణ తెలిపారు. ఇప్పటివరకు 6,800 యూనిట్లు కేటాయించామన్నారు. కలగాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన పశు విజ్ఞానబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉచిత గర్భకోశచికిత్స శిబిరం, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. మార్చి 1 నుంచి జిల్లాలో అన్ని పశువులకు నెల రోజులు పాటు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు వేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 5లక్షలు పశువులకు పీపీఆర్ వ్యాక్సిన్స్ వేశామన్నారు. జిల్లాలో మొదటి విడతగా 7 పశు సంచార వాహనాలు, రెండవ విడతలో 6 వాహనాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. పాడిరైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ ఉపసంచాలకులు రామచంద్రరావు, పశుగణాభివృద్ధి అధికారి ధామోదరరావు, గంట్యాడ, ఎస్.కోట ఏడీలు రెడ్డి కృష్ణ, బి.చలపతిరావు, అలమండ, తాండ్రంగి పశువైద్యాధికారులు నరేష్‌కుమార్, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

పాముకాటుతో ఉపాధి కూలీకి అస్వస్థత

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లికి చెందిన ఉపాధి కూలీ బొద్దు గౌరమ్మ(48)కొండలబంద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులకు మంగళవారం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. ఈ విషయం గమనించిన తోటి కూలీలు ఆమెను బొండపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య సిబ్బంది,కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలిపల్లి పైడితల్లికి ప్రణమిల్లి

- భక్త జనసంద్రమైన రాజాం
- ఘనంగా అమ్మవారి జాతర



యాత్రికులతో కళకళలాడుతున్న బొబ్బిలి రహదారి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం కనుల పండువగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న జాతరకు చివరిరోజు మంగళవారం తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాజాం పట్టణంలోని రోడ్లన్నీ భక్తులతో కిటకిటలాడి జనసంద్రాన్ని తలపించాయి. సుమారు కిలోమీటరు పొడవునా బొబ్బిలి జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయం వరకు భక్తులు కనిపించారు. మొదటి మొక్కుగా అమ్మవారి ఆలయం వద్ద వేపచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కోళ్లు, గొర్రెలను సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయం వెనుక భాగంలో పలువురు తమ పిల్లల తలనీలాలు సమర్పించారు.

సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు..

ఎండ తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో యాత్రకు తరలిరావడంతో పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు సేవలందించాయి. ముఖ్యంగా మంచినీరు, మజ్జిగ, అల్పాహారం, పులిహోర ప్యాకెట్లును పంపిణీచేశాయి. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, వాసవీక్లబ్ మన రాజాం-సారథి, సత్యసాయి సేవా దళ్ సభ్యులు, కాళింగ సంక్షేమ సంఘం తదితర స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టాయి.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతరలో ఏర్పాట్లపై ఈఓ మాధవరావుతోపాటు సీఐ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కిమిడి కళావెంకటరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భారీ బందోబస్తు..

చివరి రోజు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో పోలీసుశాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు ఆదేశాల మేరకు బందోబస్తులో ఇద్దరు సీఐలతోపాటు 14 మంది ఎస్సైలు, 54 మంది ఏఎస్సైలు, హెచ్‌సీలు, 120 మంది కానిస్టేబుళ్లు, 16 మంది మహిళా పోలీసులు, 93 మంది హోం గార్డులతో పాటు రోప్ పార్టీలు, ఏఆర్ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. అలాగే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

జాతర ముగింపు ఇలా..

అమ్మవారి గర్భగుడి నుంచి ఆదివారం తీసుకువెళ్లిన విగ్రహాలను మంగళవారం అర్ధరాత్రి తిరిగి ఆలయానికి చేర్చడంతో జాతర ముగుస్తుంది. ముగింపు పురస్కరించుకుని అర్ధరాత్రి సమయంలో కనులు మిరుమిట్లు గొలిపే నిర్వహించిన బాణసంచా కాల్పులు భక్తులను ఆకట్టుకున్నాయి.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ విజేత యానాం

- ద్వితీయ స్థానంలో కృష్ణా జిల్లా
- నగదు బహుమతి, ట్రోఫీలు అందజేసిన జెడ్పీ చైర్మన్



ప్రథమస్థానంలో నిలిచిన యానాం జట్టుకు నగదు బహుమతి, ట్రోఫీ అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ సోమవారం రాత్రి ముగిసింది. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో ఈ నెల 26న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, యానాం నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన టోర్నమెంట్ సోమవారం రాత్రి 10 గంటల వరకు జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన హోరాహోరీ పోటీల్లో యానాం, కృష్ణా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. సోమవారం రాత్రి ఈ రెండు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. చివరకు కృష్ణా జిల్లా జట్టుపై యానాం జట్టు విజయం సాధించింది.

విజేతలకు నగదు బహుమతులు

రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన యానాం జట్టుకు రూ.30 వేల నగదు బహుమతితో బాటు ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా జట్టుకు రూ.25 వేల నగదుతో బాటు ట్రోఫీని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందజేశారు. అలాగే తృతీయ స్థానంలో నిలిచిన పశ్చిమ గోదావరి జట్టుకు రూ.20 వేల నగదు, నాల్గవ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు రూ.15 వేలు, ఐదవ స్థానంలో నిలిచిన విజయనగరం జట్టుకు రూ.10 వేలు, ఆరవ స్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జిల్లా జట్టుకు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు భగవాన్, పీఈటీలు పీసీ.స్వరూప్, మురళీధర్‌లను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మంగళగిరి శ్రీను, ఇప్పిలి గోవింద, సూరు కుమార్, పతివాడ రాజారావు పాల్గొన్నారు.

సీసీ ఫుటేజ్ ఆధారంగా చోరీ కేసు ఛేదన

- అదుపులోకి నిందితుడు, సొత్తు రికవరీ



విలేకరుల సమావేశంలో వివరిస్తున్న డీఎస్పీ తదితరులు

పాలకొండ రూరల్/పాలకొండ: సరిగ్గా వారం క్రితం పాలకొండ నగరపంచాయతీ ప్రధాన మార్కెట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ముదునూరివారి వీధిలో వద్దె కమల ఇంటికి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి ఇల్లు అద్దెకు కావాలని అడుగుతూ ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తస్కరించిన ఘటన తీవ్ర సంచలనమైంది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఎస్.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డాగ్‌స్క్వాడ్, సీసీఎస్, క్లూస్ టీమ్‌తోపాటు మరో రెండు బృందాలు ఈ కేసులో పురోగతి కోసం విస్తృతంగా దర్యాప్తు చేపట్టాయి. ఎటువంటి ఆధారాలు లభించనప్పటికీ వారం వ్యవధిలో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చోరీ చేసిన నాలుగు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలియజేశారు.

సీసీ పుటేజీల సహకారంతో..

చోరీ కేసును ఛేదించేందుకు సీసీ పుటేజీలను విశ్లేషిస్తున్న క్రమంలో ఓ వ్యక్తి ఘటన జరిగిన ప్రాంతంలో పదేపదే తచ్చాడుతుండడాన్ని పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి పుటేజీని వివిధ కూడళ్ల వద్ద సేకరించిన పోలీసులు నిందితుడిని పాలకొండ పరిధిలో ఎన్‌కే.రాజపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించారు. ఆ వ్యక్తి స్థానికుడైనప్పటికీ చైన్నైలో పనులకు వలస వెళ్లి పండగకు స్వగ్రామం వచ్చాడని తెలుసుకున్నారు. స్థానిక యాలాం కూడలివద్ద నిందితుడిని అదుపులోకి తీసకున్న పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయగా దొంగతనం చేసినట్లు అంగీకరించి సదరు గొలుసును పోలీసులకు అప్పగించాడు.

త్వరలో బీసీ రాజకీయ పార్టీ

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు



శ్రీనివాసరావుకు నియామకపత్రం అందజేస్తున్న శంకర్రావు

విజయనగరం ఫూల్‌బాగ్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల రాజకీయ పార్టీని రాష్ట్రంలో త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం బీసీ సంక్షేమ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా కెల్ల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా సీహెచ్ వెంకటరావులను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గొర్లె సూరిబాబు, ఎస్ శ్రీనివాసరావు, టి బుజ్జిబాబు, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కోళ్ల మృతి

భోగాపురం: మండల కేంద్రంలోని చిన్న వీధికి చెందిన శీల శంకర్రావు ఇంట్లో ఉన్న కోళ్లపై సోమవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు రూ.20 వేలు విలువ చేసే 15 కోళ్లు మృత్యువాత పడ్డాయి.

బాల్య వివాహానికి అడ్డుకట్ట

విజయనగరం ఫోర్ట్: మార్చి నెలలో జరగనున్న ఓ బాల్య వివాహానికి బాలల సంరక్షణ విభాగం, చైల్డ్‌లైన్, ఐసీడీఎస్ అధికారులు అడ్డుకట్ట వేశారు. బొండపల్లి మండలానికి చెందిన ఓ బాలికకు మార్చి 18 వతేదీన అదే గ్రామానికి యువకుడితో వివాహం చేయాలని ఇరువురి తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈ విషయం ఓ అజ్ఞాత వ్యక్తి చైల్డ్‌లైన్ ట్రోల్ ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించారు. ఈ సమాచారం మేరకు చైల్డ్‌లైన్, డీసీపీయూ, ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి చేరుకుని బాల్య వివాహం చేయడం చట్ట రిత్యా నేరమని, ఇరువురి కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి బాల్య వివాహాన్ని నిలుపుదల చేశారు.

అధ్యాపకులపై ఫిర్యాదు

గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతిష్ట దెబ్బతీసేలా తమపై లేనిపోని ఫిర్యాదులు చేసి విసిగించిన అధ్యాపకులు ఎస్.వి.సన్యాసిరావు, ఎస్.వి.రమణలపై ఆర్‌ఐఓ, ఇతర విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశానని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి తెలిపారు. దీంతో వారిని ఇంటర్మీడియట్ బోర్డుకు సరెండర్ చేశారన్నారు.

సైన్స్ టీచర్‌కు జాతీయ స్థాయి అవార్డు



రేగిడి ఉన్నత పాఠశాలలో ఉమామహేశ్వరిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రేగిడి: రేగిడి ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు బూరవిల్లి ఉమామహేశ్వరి శాస్త్ర విజ్ఞానానికి గుర్తింపు లభించింది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు మెచ్చకున్నారు. జాతీయ స్థాయి సారాబాయ్ టీచర్ సైంటిస్టు అవార్డుకు ఎంపిక చేశారు. ఆమెను ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు, పాఠశాల హెచ్‌ఎం మరడాన రామినాయుడు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారావు, వీవీఎం రాష్ట్ర కోఆర్డినేటర్ ఎ.పున్నయ్య, సర్పంచ్ కిమిడి రవిశంకర్, విద్యాకమిటీ చైర్మన్ ఎం.రామకృష్ణ, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒడిశా వాసి మృతి



మృతిచెందిన దురక జగన్నాథ్

సాలూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒడిశా వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్సై పాపారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా సింగిగుడకు చెందిన దురక జగన్నాథ్(30)ను సాలూరు మండలంలోని జీగిరాం సమీపంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- కెనడా, చైనా పారిశ్రామిక వేత్తలు



సత్కారం పొందుతున్న చైనా పారిశ్రామిక వేత్త హుయిహాంగ్‌జో, కెనడా పారిశ్రామిక వేత్త శివకుమార్

విజయనగరం అర్బన్: మన చుట్టూ అనంతమైన అవకాశాలున్నాయని వాటిని అందిపుచ్చుకునే ప్రతిభను, నేర్పును విద్యార్థులు అలవరచుకోవాలని చైనా పారిశ్రామిక వేత్త హుయిహాంగ్‌జో, కెనడా పారిశ్రామిక వేత్త శివకుమార్‌లు హితవు పలికారు. ఈ మేరకు స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన సైన్స్ డే ఉత్సవాలకు కెనడా, చైనా పారిశ్రామిక వేత్తలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ శక్తి అమోఘమైనదని సరైన క్రమంలో దానిని ఉపయోగించుకోవడం ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థుల భవిత అధారపడుతుందన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్‌నాయుడు, డీన్ రీసెర్చ్ డాక్టర్ నరేంద్ర కుమార్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

వీడిన హత్య కేసు మిస్టరీ

- తప్పుడు బిల్లుతో దొరికిపోయిన నిందితుడు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ హెచ్ ఉపేంద్ర, ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు

వంగర: వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్న వృద్ధ ప్రేమికుల మధ్య తలెత్తిన పొరపొచ్చాలతో ప్రియురాలిని ప్రియుడు హతమార్చాడు. వంగర మండలంలోని కొండచాకరాపల్లి గ్రామపచ్చని పంటపొలాల్లో జరిగిన ఫిబ్రవరి 20 వ తేదీన జరిగిన వృద్ధురాలి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ మేరకు రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు మంగళవారం వంగర పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన 62 ఏళ్ల గంట చిన్నమ్మి భర్త అప్పలనాయుడు గతంలో మృతిచెందడంతో అదే గ్రామానికి చెందిన 68 ఏళ్ల బూరాడ చిన్నంనాయుడుతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుంది. అయితే చిన్నమ్మి కొంతకాలంగా ఇదే మండలంలోని నీలయ్యవలసలో చిన్నకుమార్తె సతిపిడకల పుణ్యవతి దగ్గర ఉంటోంది. ఈ నేపథ్యంలో వృద్ధ ప్రేమికుల మధ్య దూరం పెరగడంతో విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఫిబ్రవరి 20న చిన్నమ్మి స్వగ్రామం కొండచాకరాపల్లి రావడంతో ఆరోజున మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రేమికులిద్దరూ జొన్న చేను వద్ద కలుసుకున్నారు. నాకు దూరమై వేరేవాళ్లతో తప్పుగా తిరుగుతున్నావు. నీ బండారం బయటపెడతానని ప్రియుడిని చిన్నమ్మి హెచ్చరించింది. దీంతో ఒక్కసారిగా కోపోద్రిక్తుడైన చిన్నంనాయుడు ఆమె చెంపపై కొట్టడంతో నేలకొరిగి అపస్మారక స్థితిక చేరుకుంది. చిన్నమ్మి స్పృహలో లేదని గుర్తించిన చిన్నంనాయుడు చీర చెంగుతో ఆమె గొంతు చుట్టూ చుట్టి నులిమి చంపాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న 3తులాలకు పైగా బంగారు ఆభరణాలు కూడా అపహరించి అక్కడి నుంచి జారుకున్నాడు.

ఫిర్యాదు మేరకు పోలీసుల దర్యాప్తు

తల్లి చిన్నమ్మి మృతిచెందిన విషయం తెలుసుకున్న చిన్నకుమార్తె పుణ్యవతి ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బృందాలుగా ఏర్పడి అనుమానితులను విచారణ చేస్తూ నిందితుడి కోసం గాలించారు.

తప్పుడు బిల్లుతో చిక్కిన నిందితుడు

విచారణలో భాగంగా పోలీసులు చిన్నంనాయుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. చిన్నమ్మిని చివరిసారిగా ఎప్పుడు చూశావని అడగ్గా కొన్ని నెలలైందని సమాధానం ఇచ్చాడు. ఆ రోజున తాను గ్రామంలో లేనని, బలిజిపేట మండల కేంద్రంలో ఉన్న ఎరువుల దుకాణంలో యూరియా బస్తా కొనుగోలుకు వెళ్లానని చెప్పి బిల్లు చూపించి పోలీసులకు నమ్మబలికాడు. అయితే ఆ బిల్లును తీసుకున్న పోలీసులు బలిజిపేటలోని షాపు యజమాని వద్ద వెళ్లి ప్రశ్నించగా..రాయితీ వస్తుందని అడిగితే ఇచ్చానని, వాస్తవంగా చిన్నంనాయుడు యూరియా కొన్నది ఒక రోజు..బిల్లు మరో తేదీలో తీసుకున్నాడని వ్యాపారి చెప్పాడు. ఈ విషయాన్ని చిన్నంనాయుడు వద్ద పోలీసులు ప్రశ్నించగా..జరిగిన వివరాలన్నీ వెల్లడించాడు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి పాలకొండ జ్యూడిషియల్ కస్టడీకి తరలించారు.

ఎన్నికల్లో పోలింగ్ అధికారులది కీలక పాత్ర



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఆర్‌ఓ వెంకటరావు

పార్వతీపురం: శాసనమండలి ఎన్నికలు సజావుగా, పకడ్బందీగా జరిగేందుకు పోలింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకటరావు పేర్కొన్నారు. ఈ మేరకు పోలింగ్ అధికారులు, సెక్టార్ అధికారులతో ఎన్నికల ప్రక్రియ, విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు స్థానిక కలెక్టరేట్‌లో అవగాహన శిక్షణ తరగతులను మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ఈనెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామని తెలిపారు. పోలింగ్ అధికారులు సామగ్రిని సరిచూసుకుని నియమించిన పోలింగ్ కేంద్రాలకు రూట్ అధికారులతో చేరుకోవాలని సూచించారు. మౌలిక సదుపాయాలు, వెబ్ కాస్టింగ్‌కు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో పీఓల అనుమతిలేనిదే ఎవరినీ అనుమతించరాదన్నారు.

మొబైల్స్ నిరాకరణ

ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పోలింగ్ ముందురోజు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. 13 తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ ఉంటుందని, ఎన్నికల నిర్వహణకు ఉదయం 7గంటలకు పోలింగ్ అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ సమయం ముగిసే సరికి క్యూలో ఉన్నవారిని మాత్రమే అనుమతించి స్లిప్‌లు జారీచేయాలని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లు, ఇతరులకు మొబైల్ ఫోన్లు, కెమెరాల వంటివి అనుమతి లేదని వెల్లడించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం ఎన్నికల ప్రక్రియలో పాటించవలసిన జాగ్రత్తలు, పోలింగ్ తరువాత బ్యాలెట్ బాక్స్ సీల్ చేసి, భద్రపరచే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల రిసోర్స్ పర్సన్‌లు పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, పార్వతీపురం ఆర్డీఓ కె.హేమలత, పోలింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

APS RTC
టెండరు ప్రకటన
[illegible] https://www.apsrtc.ap.gov.in లో tenders [illegible] APSRTC [illegible]
నెం. P3/437(01)/2023-DPTO/VZM, తేది:27-02-2023 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, విజయనగరం.

ANDHRA PRADESH MEDICAL SERVICES & INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION
1st Floor, Central Medicine Stores, Beside DM & HO's Office Building, District Hospital Compound, Vizianagaram-535003 Phone No. 9849515953 (Mail Id: eeapmsidcvzm@gmail.com)
Short Tender Notice No. 10/APMSIDC/EE-VZM/2022-23, Dt. 28.02.2023
Tender are invited through e-procurement platform for 1) Procurement of Laproscope to Govt.General Hospital, Vizianagaram with a EMD cost for Rs.25000/- and Schedule Cost of Rs. 2000/- in shape D.D infavour of Executive Engineer, APMSIDC., Division, Vizianagaram for further details please visit www.tender.apeprocurement.gov.in On-Line Tenders NIT No.10 Last date for Uploading 17.03.2023 upto 3.30 PM.
Sd/- Executive Engineer,
APMSIDC., Division, Vizianagaram

బహిరంగ ప్రకటన
[illegible]
షెడ్యూలు ఆస్తి వివరములు
[illegible]
K. MADHUSUDHANA RAO & T. MONIKA, Advocates
2nd Floor, Akhila Arcade, Rama Talkies Road, Asilmetta, Visakhapatnam. Cell : 9989012912

సాక్షి క్లాసిఫైడ్స్

అద్దెకు ఇవ్వబడును
■ వ్యాపారాలు అభివృద్ధి అవుతున్న గజపతినగరం మెయిన్ సెంటర్ NH26 ఆనుకొని గణేష్ కోవెల వెనుక బస్టాండ్ దగ్గర 30x60 చ॥అడుగుల స్థలములో 3 అంతస్తులు బిల్డింగ్ స్లాబ్‌వేసి అద్దెకు ఇవ్వబడును. Cont: 9333449333 [S-1156467]

ఆయుర్వేదం
■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-11]

WANTED
■ అగ్రికల్చర్ ఫీల్డ్ వర్క్ చేయుటకు 10th to డిగ్రీ గల స్టాఫ్ కావలెను. జాబ్స్ (1) D.C.O - జీతం : 22 వేలు + 3 వేలు. & ఫీల్డ్ ఆఫీసర్ : జీతం : 14 వేలు + 2,500. 7680002670, 8885863691. [A-734033]
■ విశాఖపట్నంలో ప్రముఖ ఓల్డేజ్ హోమ్‌కి, వృద్ధులకు సేవ చేయుటకు 24 గంటలు ఆడ/మగ కావలెను. ఉచిత భోజనం & వసతి ఇవ్వబడును. ఫోన్ : 99899 93756 [V- 735]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781919]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233,7036235766. [M-1190581]
■ Corporate బ్యాంక్‌లలో పనిచేయుటకు Cashiers, Clerks,Senior Officer, (Sales) Attenders కావలెను. జీ: 12,000 -40,000 వరకు. ✆ 9642506425, 8297797197. [T-4032]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్ నర్సులు, వంటవారు, Rmp Dr. Q-5th-డిగ్రీ, 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. ఫోన్ : 7995365999 [HA-1030]
■ హైదరాబాద్‌లోని ఓల్డేజ్ హోం కొరకు రెసి॥ లేడీ కేర్‌టేకర్స్, రెసి॥ వంటవారు (వ. 35-40) & ఆయాలు కావలెను. మంచి జీతం, ఫ్రీ వసతి+భోజనం. ఫోన్ : 9700006699, 7981467036 [H-793518]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.